కానుక

"నమస్కారం, టీచర్!"

"ఎవరది?" తలఎత్తి చూసింది సీతాదేవి, చేతుల్లో ఉన్న ఎంబ్రాయిడరీ ఫ్రేమ్ పక్కన పెడుతూ.

ఎదురుగా ఎరుపుగళ్ల పట్టుచీరతో, మెడలో నగలతో, తలనిండా మల్లె పూలతో ఐశ్వర్యానికి, సౌందర్యానికి ప్రతిబింబంలా ఉంది ఒక యువతి. ఆమె పక్కనే తెల్లని ఫ్రాకియూయీ ట్రైయిల్స్‌తోచందమామలాంటి చిన్నారి నిలబడివుంది. చప్పున గుర్తు పట్టలేక పోయింది. వృద్ధురాలైన సీతాదేవి. నేనే టీచర్, లలితను.... ఇప్పటకైనా గుర్తుకు వచ్చానా?" అంటూ నవ్వుతూ దగ్గరకు వచ్చి తన చేతిలోని పళ్ళు ఆమె కిచ్చి, కాళ్లకు దణ్ణం పెట్టింది ఆమె. ఇంద్రధనుస్సులా వంగి దణ్ణం పెడుతున్న ఆమె బారెడు జుట్టు, పచ్చటి, సన్నని నడుము చూడగానే సీతాదేవి వెంటనే గుర్తు పట్టింది.

"అమ్మా! నువ్వు లలితవా?" అంటూ దగ్గరకు తీసుకున్నది ఆమెను. "ఈ పాప?" అంది వెంటనే, సగం తెలుసులే అనే భావనతోనే.

"మా పాపేనండి!" అంది నవ్వుతూ లలిత.

"రా, అమ్మా! రా తల్లీ, రా, అమ్మా!" అంటూ పాపను దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నది ఆవిడ.

ఆ వృద్ధురాలిలో ఏ భావాలు మెదిలాయో – ఆమె కన్నుల నుండి ఆనందాశ్రువులు ఆగకుండా ప్రవహిస్తున్నాయి. జారిపోయిన బుగ్గలు, కళ్లకింద నీడలు, ఎండిపోయిన చేతులు, కళ్లజోడు, ఊడిపోయిన పన్ను... అసలే పిట్టమనిషేమో వృద్ధాప్యం మరింత కుంగదీసింది ఆమెను.కానీ ఆ నవ్వులో, ఆ ఆప్యాయతలవెన్నెల నీడల శతకోటి ఆశీస్సులు----- అవి మాత్రం మారలేదు.

"మీరు చాలా ముసలివారైపోయారు, టీచర్..." నవ్వుతూ అంది లలిత.

"కాదు మరీ... వయస్సు రాలేదా, ----- నువ్వు మాత్రం ఆ నాటి లలితలా ఉన్నావా, చెప్పు?" అన్నది, పాప బుగ్గమీద మృదువుగా ముద్దుపెట్టుకుంటూ. మిలమిలా మెరిసే ఇంతింత పెద్ద కళ్ళతో ఆవిడ వంక ఆశ్చర్యంగా చూసింది పాప.

"మా శేఖర్ కళ్లే వచ్చాయి, లలితా పాపకు. ఊc! ఇంతకూ అతను ఎలా ఉన్నాడు? కలాసానా? ప్రాక్టీసు అదీ బాగున్నదా?" ఆప్యాయంగా అడిగింది ఆవిడ.

"అఁ! కులాసానే... మా చుట్టాల ఇంట్లో పెళ్లి, టీచర్! ఆయన రాలేకపోయారు. మీ ఓల్డ్ స్టూడెంట్ ఎవరో మీ అడ్రస్ ఇచ్చాడట. వచ్చేముందు కంపార్ట్‌మెంట్ ఎక్కేదాకా ఏ వంద సార్లో చెప్పారు... మిమ్మల్ని చూసి రమ్మని. మీకు నమస్కారాలని చెప్పమన్నారు."

గలగలా నవ్వింది సీతాదేవి.

"పిచ్చి అప్యాయతమ్మా అతనిది. ఏముంది నన్ను చూడటానికి తల్లీ? ఎండి రాలిపోయే పండుటాకును" అంది సీతాదేవి.

"అలా అనకండి, టీచర్! మీరు వంద సంవత్సరాలు చల్లగా ఉండాలి. ఈ రోజు మేమింత సుఖంగా ఉన్నామంటే అది మీ చలవే, టీచర్!" అది లలిత. ఆ మాటలన్నీ భక్తి, వినయం, అప్యాయతలతో చేసిన రసగుళికలలాగా ఉన్నాయి ఆమె చెవులకు. అంతకన్న వృద్ధాప్యంలో తనదంటూ ఏమీ మిగుల్చుకోకుండా కేవలం సీతా టీచర్‌గా మాత్రం మిగిలి, ఏ చల్లటి సాయంత్రాన్నో ఈ జీవితపు గ్రంథాన్ని సవ్వడి లేకుండా ముగించడానికి ఎదురుచూస్తున్న ఆ వృద్ధురాలి జీవితంలో మధుర క్షణాలు ఏముంటాయి?

అప్యాయతా పరిమళాలు నిండిన ఆ గదిలో కొన్ని క్షణాలు మౌనం మృదువుగా మ్రోగింది.

"టీచర్! రాజీ..." ఏదో జ్ఞాపకమొచ్చినట్లుగా అంది లలిత.

గాజుకళ్లతో తల ఎత్తి చూసింది సీతాదేవి. ఆ వృద్ధురాలి కళ్లలో జ్ఞాపకాల నీడలు కదలాడాయి.

"అవునమ్మా! మనకు రాజీ ఇక లేదు.. మీకు తెలుసుగా?..." అంది ఎటో చూస్తూ.

"అవును! టీచర్! తరవాత తెలిసింది. ఆయనా, నేనూ చాలా బాధపడ్డాము. అసలు అలా ఎలా జరిగింది, టీచర్?"

"పోనిలే, అమ్మా! అదంతా ఇప్పుడెందుకు? ఊఁ! ఇంకా విశేషాలు ఏమిటి?" అంటూ మాట తప్పించి పక్కనున్న ఎంబ్రాయిడరీ చేతిలోకి తీసుకున్నది.

ఎవరి పాప ఫ్రాక్ మీదో పువ్వులు కుడుతున్నది సీతాదేవి.

"ఎవరికి టీచర్, అది?" అంది లలిత.

"పక్క ఇంటి పాప పుట్టినరోజమ్మా రేపు. ఆ పాపకు నేనంటే పంచప్రాణాలు. శిథిలమైపోతున్న ఈ నా చేతులతో ఇంకా అ ఆ లు దిద్దించాలని ప్రయత్నిస్తోందమ్మా ఆ పాప" అన్నది ఆమె గలగలా నవ్వుతూ.

"మీకింకా ఎదురింటి అమ్మాయిల మీదా, పక్కింటి అమ్మాయిల మీదా మోజు తీరలేదా, టీచర్?" సూటిగా చూస్తూ అన్నది లలిత.

ఆవిడ మాట్లాడలేదు. కాని, ఆవిడ మౌనం లలితకు చాలా చెప్పింది. మెల్లగా ఏవో కబుర్లు సాగాయి. చల్లటి పిల్లగాలిలో సన్నజాజుల పరిమళాల వంటివి జ్ఞాపకాలు. వాటిలో ఆనందం అనుభవించేవారికే తెలుస్తుంది.

"వస్తాను, టీచర్!... ఆలస్యమైంది. మళ్లీ రేపు రాత్రి వెళ్లిపోతున్నాను. వెళ్లేముందు వస్తాను" అంది లలిత, సీతాదేవి ఒళ్లో ఆదమరిచి నిద్రపోతున్న పాపను తీసుకుంటూ.

లలితను పంపి తలుపు వేసి వెనక్కు తిరిగింది సీతాదేవి. ఒక్కసారిగా రాజీ జ్ఞాపకాలు ఉవ్వెత్తున ఆమెను కదిల్చివేశాయి. కళ్ల నీళ్లు తుడుచుకుంటూ వద్దనుకుంటూనే ఒక్కొక్క అడుగే వేసుకుంటూ మెల్లిగా పాత ట్రంక్ పెట్టె తీసి, ఆ మూలా ఈ మూలా వెతికి, చిన్న అట్టపెట్టె తీసుకుని సోఫాలో కూర్చుంది సీతాదేవి. లైటు కాంతిలో మిలమిలా మెరిసిపోతున్న తెల్లరాళ్ల ఉంగరం! కళ్లలో సుళ్లు తిరుగుతున్న కన్నీళ్ల చాటుగా దాన్నే పరీక్షగా చూస్తున్న సీతాదేవికి ఉంగరంలో ప్రతి రాయీ రాజీ కథను గుర్తుకు తెచ్చింది.

దాదాపు పదేళ్ల క్రితం....

❀ ❀ ❀

రాజమండ్రికి ట్రాన్స్‌ఫర్ అయివచ్చిన సీతాదేవి, కొత్త వాటాలో సామాను సర్దుకుంటూ, ఎవరో గుమ్మంలో నిలబడ్డట్టనిపించి తల ఎత్తి చూసింది. అప్పటిదాకా నిలుచున్న అమ్మాయి చప్పున వెనక్కి తిరిగి వెళ్లిపోయింది.

'ఇంటి వాళ్ల అమ్మాయి కాబోలు! రేపన్నా వాళ్లను పరిచయం చేసుకోవాలి' అనుకుంటూ కాంప్‌కాట్ మీద మేనువాల్చింది సీతాదేవి.

❀ ❀ ❀

"ఏమిటే, అమ్మా, ఆవిడ అలా ఉన్నదీ! పెళ్లయినట్లు లేదు. లేకపోతే వెధవముండ అంటావా? టీచర్లాగా లేనేలేదేమే?" ఎవరో అమ్మాయి దీర్ఘాలు తీస్తూ అంటున్న మాటలు పక్కవాటాలోనించి వినిపించాయి.

చప్పున తాగుతున్న కాఫీ గ్లాస్ పక్కన పెట్టేసింది సీతాదేవి. ఇప్పుడు తను చూసిన అమ్మాయేనా ఈ మాటలాడేది? ఓరి, భగవంతుడా, ఇదేం భాష? అనుకున్నది వెగటుగా.

మర్నాడు పొద్దున్నే తలుపు చప్పుడై తీసింది.

"కొత్తగా వచ్చినట్లున్నారు, పిన్నిగారూ! ఏదీ, రాత్రి చూద్దామంటే పడనేలేదు. అన్నీ వసతిగా ఉన్నాయా?" అంటూ ఒకావిడ వంటింటి దాకా తొంగి చూచి ఇంకా గబగబా ఏవో మాట్లాడేస్తూంది. నిర్ఘాంతపోయి ఆవిడను నఖశిఖ పర్యంతం పరీక్ష చేసింది సీతాదేవి. నలిగిపోయిన చీర, జారిపోయిన ముడి, వాడి దారాలు కనబడుతున్న పూవులు, మెదనిండా, చేతినిండా రకరకాల నగలు... అమ్మో, ఈవిడకు ఈ నగలతో నిద్రెలా పడుతుందో? అనుకున్నది సీతాదేవి.

"మీవారున్నారా? లేక..." అన్న ప్రశ్నతో ఒక్కసారిగా మత్తు వదిలి, "లేదండీ..." అని ఇంకా ఏదో చెప్పబోయి, "ఏమిటే, అమ్మా, ఇక్కడున్నావ్? కాఫీ

ఇవ్వవా? ఆకలేస్తోంది" అని గునుస్తూ సరాసరి లోపలికి వచ్చిన అమ్మాయిని చూసి మరోసారి నోరు తెరిచింది సీతాదేవి. చెరిగిన తల, బంగారపు జడకుప్పెలు, నలిగిపోయిన పట్టు పరికిణీ, అప్పుడే ముఖం కడుక్కున్నట్లుంది. అక్కడే వంగి పరికిణీతో ముఖం తుడిచేసుకుంటూంది ఆ అమ్మాయి.

"అహాఁ! అయితే భర్త లేడన్నమాట..." అని ఏదో నిర్ణయానికి ఆవిడే వచ్చేసి, "అలా అడిగాననుకోకండి, ఒంటరి వారని, పిన్నీ... ఆఁ! అన్నట్లు ఇది మా అమ్మాయి, పేరు చెప్పవే!?" అంది భుజాన్నానుకుని నిలుచున్న కూతుర్ని మోచేత్తో పొడుస్తూ.

"రాజరాజేశ్వరి!" సిగ్గుపడుతూ చెప్పింది ఆ పిల్ల. మెలికలు తిరిగిపోతూ.

ఏం మాట్లాడాలో తెలియలేదు సీతాదేవికి.

"చూడండీ! పాలతన్నీ అదీ ఏర్పాటు చేస్తాను. మా పాలవాడే... మంచివాడు. నిన్న కాఫీ తెప్పించుకున్నట్లున్నారు. ఈ వేళ మా ఇంటి నించి పంపుతాను లెండి. ఏమన్నా కావాలంటే అడగండి. సంకోచించకండి. వస్తా... మళ్లీ వసుంది" అని రెండు తలుపులూ బార్లాగా తెరిచి వెళ్లిపోతూ, "అన్నట్లు మీ పేరు?" అంది ఆవిడ ఆగి.

"సీతాదేవి." సన్నగా, బిక్కచచ్చిపోయి చెప్పింది. తల్లి వెనకాలే లేగదూడలా వెళుతూ, పులుక్కున చూసి మరీ వెళ్లింది ఆ అమ్మాయి.

'పిల్ల బాగానే ఉన్నది కానీ బాబోయ్' అనుకుంటూ లోపలికి వెళ్లింది సీతాదేవి.

"ఇదుగోనండి కాఫీ!" అంటూ ఒక పొడుగాటి గ్లాసులో పొగలు కక్కుతున్న కాఫీ అడుగున ఓణీ ఒత్తుగాపెట్టి పట్టుకు వచ్చింది రాజరాజేశ్వరి.

"ఎందుకమ్మా శ్రమ..." అన్నది సీతాదేవి.

"అదేం... మేం తాగడంలే?!" అని ఠపీమని టేబిల్ మీద కాఫీ పెట్టి, బెడ్డింగ్ మీద కూర్చుంది. ఆ పిల్లవి పెద్దకళ్లు. ఆ కళ్లలోని లేడి చూపులబెదురు, మంచులాంటి స్వచ్ఛత సీతాదేవిని ఇబ్బందిపెట్టాయి.

"చూడు, పాపా... ఆఁ! అన్నట్లు నిన్ను ఇంట్లో ఏమని పిలుస్తారు?"

"రాజూ అంటారండీ."

"అహాఁ! అయితే, నేను 'రాజీ' అని పిలవనా?" మెల్లిగా అడిగింది.

"అలాగే పిలవండి. నాకు అలా అంటేనే ఇష్టం. ఎందుకంటే... ఎందుకంటే..." మెల్లిగా జడ కుప్పెలు సవరించుకుంటూ సిగ్గుగా అంది.

"ఎందుకని?"

"మామయ్య నన్ను అలాగే పిలుస్తాడండీ!" అంది సిగ్గుగా.

ఆ పిల్ల చెక్కిళ్లమీద రోజాలు పూశాయి. చాలా అర్థమైనట్లుంది సీతాదేవికి.

"మీ మామయ్య అంటే ..." కాఫీ చల్లారపెట్టుకుంటూ అడిగింది.

"మామయ్య అంటే ... మా శేఖరం మామయ్యండి ... డాక్టర్ అయిదో సంవత్సరం చదువుతున్నాడు. చదువు అయిపోగానే నన్నిచ్చి చేస్తారు" అంది.

మరొకసారి నిర్ఘాంతపోయింది సీతాదేవి. 'ఏమిటీ పిల్ల, ఈ ఆలోచనలు?' అనుకుంది.

"మీ మామయ్యకు నువ్వంటే ఇష్టమేనా మరి?" నవ్వుతూ అడిగింది.

"ఇష్టమేననుకుంటా! కానీ, ఎప్పుడూ ఏడిపిస్తాడండి-కోతి, పెద్ద పేరక్కా అదీ ఇదీ అని." గారాబంగా అన్నది.

"అన్నట్లు, రాజీ, నువ్వేం చదువుకున్నావ్?" కుతూహలంగా అడిగింది సీతాదేవి.

"ఆఁ! ఏదో వానాకాలం చదువులెండి. మనకూ, దానికీ చాలా దూరం. మా మామయ్య వచ్చినప్పుడల్లా చదువుకోవే అంటాడు కానీ, నా ఒంటి కది పట్టదుగా! మరేం చెయ్యనూ?" అంది దీర్ఘం తీస్తూ.

ఏదో తెర తీసినట్లైంది సీతాదేవికి -. ఈ పిల్లను పెళ్లి ఎలా చేసుకుంటాడా అని!

"నీకు కట్నం అదీ బాగా ఇస్తారా, రాజీ?" అంది సీతాదేవి, ఏమిటీ ప్రశ్నలు. ఈ పిల్లతోపాటు నాకూ అతి ఎక్కువైపోయిందనుకుంటూ.

"ఆఁ! చాలా ఇస్తారండి. వంద కాసుల బంగారం పెడుతుంది మా అమ్మ. పొలం, కారు అన్నీ ఇస్తారట. మీరు మా ఇంటికి వచ్చినప్పుడు చూపెడతాను, పెద్ద బీరువాడు స్టీలు సామాను దాచిందండి మా అమ్మ" అని చేతులు తిప్పుతూ, కళ్లు తిప్పుతూ చెబుతున్న ఆ పిల్లను మతిపోయినట్లు చూసింది సీతాదేవి.

"రాజీ! మీ మామయ్య బాగుంటాడా?" నవ్వుతూ అడిగింది సీతాదేవి.

"చాలా బాగుంటాడు, టీచర్!... దొరబాబులా ఉంటాడు" అంది రాజీ. ఆ మాటలు చూసి అదురుకున్న సీతాదేవి ఆ అమ్మాయి కళ్లలోని ఆరాధన చూసి ఆశ్చర్యపోయింది.

"ఇదుగో, ఈ ఉంగరం మా తాతయ్య నేను పెద్దమనిషైనప్పుడు ఇచ్చాడండీ! ఇదే ప్రధానపు ఉంగరమనుకోవే, అమ్మాయీ, అన్నాడండీ! అందుకే నాకు ఇదంటే చాలా ఇష్టం. ఎప్పుడూ వేలునుంచి తియ్యను" అని ఒక తెల్లరాళ్ల ఉంగరం చూపించింది రాజీ. 'ఈ పిల్లకు అరమరికలు లేవు కాబోలు' అనుకుంది సీతాదేవి.

"ఒసేయ్, రాజీ! ఎక్కడికి వెళితే అక్కడే పాతుకుపోతా వేమే?" అన్న కేక విని, "వస్తానండి! అమ్మ పిలుస్తోంది" అని ఒక్క గెంతులో బయటికి వెళ్లి, మళ్లీ వెనక్కి తిరిగి,"ఏమండి! మిమ్మల్ని ఏమని పిలవను?" అన్నది.

"సీతా టీచర్ అని పిలు" అన్నది.

"సరే, వస్తాను, టీచర్!" అని పరుగెత్తింది రాజీ.

ఆ పిల్ల వెళ్లినా, ఎందుకో ఆ అమ్మాయి జ్ఞాపకాలు చాలాసేపు ఆ ఇంట్లో మిగిలి ఉన్నట్లనిపించాయి సీతాదేవికి.

మరో నాలుగైదు రోజుల తరవాత ఒక సాయంత్రం స్కూటర్ చప్పుడు విని కిటికీలోంచి చూసింది సీతాదేవి. ఎవరో చాలా అందమైన కుర్రాడు రాజీ వాళ్ల ఇంట్లోకి వెళ్లాడు. ఎవరై ఉంటాడా అనుకుని జవాబు వెదుక్కునే లోపలే, రాజీ అతణ్ణి చెయ్యిపట్టుకు లాక్కుని వచ్చి, "మా శేఖరం మామయ్య, టీచర్!... నే చెప్పలే, ఈవిడే సీతా టీచర్. చాలా మంచివారు" అంటూ గబగబా మాట్లాడేస్తూంది రాజీ.

"నమస్కారమండీ! ఏమిటి, మా రాజీ మీకు ఫ్రెండేమిటి!?" అంటూ కుర్చీలో కూర్చున్నాడతను.

మెల్లిగా కబుర్లు సాగాయి. అతని చదువు సంగతి, కాలేజీ సంగతి చాలా చెప్పాడు. మధ్యలో ఏదో దీర్ఘంతీస్తూ మాట్లాడబోయిన రాజీని "నువ్వూరుకో" అని కసిరాడు. కాసేపాగి, "మా మొద్దును కాస్త సంస్కరించండి, టీచర్!" అన్నాడు నవ్వుతూ.

"నాకేం, నేను బాగానే ఉన్నా!" ఉక్రోషంగా అంది రాజీ.

"ఆహా! చాలా బాగున్నావు. దీనికంతటికి కారణం మా అక్కయ్య టీచర్!" అన్నాడు.

"మధ్య అమ్మ నెందు కంటావు? అయినా, మీవాళ్ల కిదేం జబ్బు? ఆ తాతయ్యా అంతే ..." అంది.

"ఏడిశావులే. వెళ్లి అమ్మ నడిగి కాఫీపట్రా" అన్నాడు.

"ఇదుగో తీసుకువస్తా" అంటూ వెళ్లింది రాజీ.

"చూశారా, టీచర్! దాని ముది మాటలు. చాలా గోలగా ఉంది దీని వ్యవహారం. పైగా అక్కయ్య సపోర్ట్! ఎందుకులెండి" అన్నాడు.

"ఆ పిల్ల మనసు మంచిది, బాబూ!" అంది సీతాదేవి.

"నిజమే, టీచర్! కానీ, మిగతావి భరించడం ఎట్లా?" అన్నాడు. ఈలోపల రాజీ వచ్చింది. అతను వెళ్లేముందు – "మా రాజీకి చదువు చెప్పండి, టీచర్! మిమ్మల్ని చూసిన తరవాత ఇన్నాళ్లకి ఈ కొంపలో సంస్కారం ప్రవేశించిందనిపించింది. కనీసం మీరన్నా ట్రై చెయ్యండి" అని వెళ్లాడు.

ఆనాటినుండి సీతాదేవి వాత్సల్యం శేఖర్‌ను చాలా విధాల ఆకట్టుకున్నది. అతని మాటపై సీతాదేవి రాజీని మెట్రిక్ కట్టిద్దామని చాలా ప్రయత్నించింది. కానీ, పెద్ద ఆలోచనలు, అనవసరపు వ్యాఖ్యానాలు అలవాటైన రాజీ దగ్గరకు సరస్వతీదేవి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేకపోయింది. రాజీ కట్టూ, బొట్టూ, మాటలలోనన్నా మార్పు తెద్దామని ప్రయత్నిస్తే, అలవాటు లేని రాజీ ఎదురు తిరిగింది. పైగా, రాజీ వాళ్లమ్మ వచ్చి, "ఈ టక్కులు సంప్రదాయం కలవాళ్లకు చెల్లవులెండి" అని గుండెల్లో గుచ్చుకునేటట్లు అన్నది. ఆ తరవాత రాజీ విషయంలో ఎక్కువగా సీతాదేవి కలగజేసుకోలేకపోయింది.

రోజులు గడిచిన కొద్దీ రాజీలో మంచితనం సీతాదేవిని ఆకట్టుకున్నది. ఇంట్లో పిల్లలా తిరిగే రాజీలో వెన్నెల లాంటి మంచితనం చూసి, ఈ అమ్మాయి జీవితం ఎట్లా ఉంటుందోనని భయపడేది సీతాదేవి.

రాజీ కథకు ప్రస్తావన సంవత్సరం తరవాత ఎదురింట్లో లలిత ప్రవేశించిన తరవాత జరిగింది. సన్నగా బాపూ బొమ్మలా, అతి నాజూగ్గా, సభ్యతా సంస్కారాలు ఉట్టిపడేటట్లుండే లలిత పి.యు.సి. ప్రైవేటుకని సీతాదేవి దగ్గరకు వచ్చింది. ఏదో ఆఫీసులో క్లర్క్‌గా పనిచేసే లలిత తండ్రికి నలుగురు ఆడపిల్లలు. లలిత పెద్దపిల్ల. "ఎంత బాగుంది, టీచర్, ఆ అమ్మాయి!" అని లలితను చూసి రాజీ నోరు తెరిచింది. నవ్వుకుంది సీతాదేవి. నిజానికి రాజీకన్న అందం తక్కువ, రంగు తక్కువ లలితకు. కానీ, ఆ అమ్మాయికి పొందిక అందాన్నిచ్చింది.

"టీచర్!" అంటూ ఒక రోజూ లోపలికి వచ్చాడు శేఖర్. ఒక్కసారి తన విశాలమైన కనురెప్ప లెత్తి అతని వంక మౌనంగా చూసి తల దించుకున్నది అక్కడే ఉన్న లలిత. ఆ అమ్మాయి వంకే చూస్తూ నిలబడ్డ శేఖర్‌కు అక్కడే ఉన్న రాజీ లలితను పరిచయం చేసింది. బొమ్మల పరికిణీ మీద పువ్వుల నైలాన్ ఓణీ, జూకాలు, ముక్కుపుడకతో ఉన్న రాజీ, లేత రోజారంగు చీరతో అందంగా తలుపు కానుకుని ఉన్న లలిత ఒకేసారి శేఖర్ కళ్లబడ్డారు. లలితను చూసిన శేఖర్ కళ్లలో మెచ్చుకోలు అర్థమైనా, అది మరింత దూరం దారి తీస్తుందని ఊహించలేదు సీతాదేవి. ఆ తరవాత శేఖర్ వారంలో నాలుగు రోజులు అక్కయ్యగారి ఇంటికి రావడం కేవలం లలితకోసమేనని అర్థం కావటానికి చాలా కాలం పట్టలేదు ఆవిడకు.

"టీచర్! కొత్త వడ్డాణం. ఈ వేళే తెచ్చాడు కంసాలి. చూడండి" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది రాజీ. నైలాన్ ఓణీ మీద బెల్టు పెట్టుకున్నట్లు పెట్టుకుంది. అక్కడే ఉన్న లలిత, శేఖర్ నవ్వుతూ చూసుకున్నారు.

"బాగుందా మామయ్యా, బాగుందా?" అడిగింది ఆత్రంగా.

"నీ ముఖంలా ఉంది, ఘోషాణానికి పెట్టినట్లు" అన్నాడు నవ్వుతూనే శేఖర్.

కోపం తెచ్చుకోకుండానే వడ్డాణం తీసేసింది రాజీ.

"మీరు పెట్టుకోండి లలితా, చూద్దాం" అన్నాడు శేఖర్.

"వద్దండి, నాకు అలవాటు లేదు" అంది లలిత తడబడుతూ.

"ఫరవాలేదు... చూద్దాం... ఆవిడకు ఇవ్వవే, రాజీ!" అన్నాడు శేఖర్.

సన్నటి నడుం బారెడు జడ, పొందికగా కట్టిన చీరలో ఉన్న లలితకు వడ్డాణం చాలా అందంగా ఉంది. అదోలా శేఖర్ వంక చూసి "ఎలా ఉంది?" అంది లలిత.

ఆ చూపులు చూడగానే చాలా విషయాలు అర్థమైనాయి సీతాదేవికి.

"చూశావా, ఆ అమ్మాయికి ఎంత బాగుందో? నీ నడుమూ ఉంది రౌండ్ టేబిల్‌లా" అన్నాడు శేఖర్ రాజీని చూస్తూ.

మాట్లాటలేదు రాజీ. ఒక్కసారి కళ్లెత్తి చూసింది. ఆ చూపులు దెబ్బతిన్న లేగ దూడ చూపుల్లా ఉన్నాయి. సీతాదేవికి గుండెలు మెలిపెట్టినట్లైంది మెల్లిగా వడ్డాణం తీసుకుని గుడ్డలో నీళ్లు కుక్కుకుంటూ వెళ్లిపోయింది రాజీ. ఆరోజే మొదటిసారిగా రాజీ బాధపడడం చూసింది సీతాదేవి.

"టీచర్! నేను వచ్చి చాలాసేపైంది. అక్కయ్య, రాజీ బయటికి వెళ్లినట్లున్నారు. ఒకవేళ అక్కయ్య వచ్చి అడిగితే మీ ఇంట్లో భోజనం చేశానని చెప్పండేం" అన్నాడు శేఖర్ ఒకనాడు వచ్చి.

"అదేం?" అంది సీతాదేవి ఆశ్చర్యంగా.

"నేను లలిత వాళ్లింట్లో భోజనం చేశాను. ఇప్పుడు తెలిస్తే గోల పెడుతుంది. ప్లీజ్!" అన్నాడు.

అతని వంక పరీక్షగా చూసింది సీతాదేవి. ఆ చూపులు తప్పించుకుంటూ వెళ్లిపోయాడు శేఖర్.

"క్యాబేజీ కూరా, బీరకాయ పప్పు, గారెలూ ..." ఏమిటేమిటో చెపుతున్నాడు రాత్రి తొమ్మిదింటికి వచ్చిన వాళ్ల అక్కకు శేఖర్. "ఇన్ని చేసిందిటరా ఆవిడా?" అని ఆశ్చర్యపోతూంది రాజీ వాళ్లమ్మ.

తొమ్మిదింటికి అన్నం తింటూండగా వచ్చింది రాజీ.

కంచంలోని సాంబారూ, కూరా చూస్తూ కూర్చుంది.

"ఏమిటి రాజీ, చూస్తున్నావు? అన్నం తింటావా?" అడిగింది సీతాదేవి ఆప్యాయంగా.

"వద్దు టీచర్, తిన్నాను" అంది ఎటో చూస్తూ.

"టీచర్!" అంది కాసేపాగి.

"ఏమమ్మా?"

"మామయ్య లలితా వాళ్లింట్లో భోజనం చేశాడా?"

"ఏం, అలా అడిగావ్?" అంది ఆశ్చర్యంగా సీతాదేవి.

"ఏం లేదు" అంటూ వెళ్ళిపోయింది. అమాయకురాలైన రాజీలో అసూయ పొదులు కొలుపుతూంది. కానీ, కేవలం అసూయతోనూ, అతి ప్రేమతోనూ లలితతో పోటీ పడే అర్హత రాజీకి లేదు.

లలిత కళ్లు, మాట, నడక, కట్టు అన్నీ చాలా అందంగా ఉండేవి చూడ్డానికి. దానికి తగ్గట్లు అందరి వంకా మామూలుగానూ, శేఖర్ వంక మాత్రం కోటి అర్థాలు నిండిన చూపులను ఇల్లి, నిమిష నిమిషానికీ అతణ్ణి కట్టి పడేసేది లలిత. రాజీ ఎదురుగా ఉంటే ఆ ఇద్దరి మధ్య వ్యత్యాసంవల్లనేమో అది మరింత కొట్టవచ్చినట్లు కనిపించేది. కొన్నాళ్లకి లలితలా చీర కట్టాలనీ, కళ్లు దిద్దుకోవాలనీ ప్రయత్నించి, అభ్యాసం లేక అభాసై, శేఖర్ వెక్కిరించాడని రెండు రోజులు అన్నం తినక బాధపడింది రాజీ. కానీ, ఆమె ఏనాడూ మంచితనం లలితను గురించి వాళ్లమ్మకు

చెప్పనివ్వలేదు. క్రమంగా రాజీ కళ్లలో నీలి నీడలు కనబడసాగాయి. వాటి అర్థం సీతాదేవికి తెలుసు. కానీ, ప్రయోజనం?

"నా నిర్ణయం తప్పంటారా, టీచర్?" అడిగాడు శేఖర్ ఒకరోజు.

లలితను తప్ప ఎవర్నీ పెళ్లిచేసుకోడట. ఏమనగలదు సీతాదేవి?

"కానీ, రాజీ నీ మీద ఆశలు ..." నసుగుతూ అంది.

"అదొక పిచ్చిది, టీచర్! ఇట్టే మరిచిపోతుంది. అయినా, నేను రాజీని ఎలా చేసుకోను, టీచర్?" అన్నాడు తేలిగ్గా.

"అలా అయినప్పుడు నువ్వు మొదట్లోనే రాజీ ఆశలు తుంచెయ్యాల్సింది, శేఖర్!" అంది సీతాదేవి బాధగా.

"నేను రాజీకి ఎటువంటి ఆశలూ కల్పించలేదు, టీచర్! చిన్నప్పటి నుంచీ దాని మొగుణ్ణి నేనే నన్న భావం దానికి ఈ పెద్దవాళ్ళంతా కలిగించారు. దానికి నే నెంతవరకు బాధ్యుణ్ణి? ఇంకొక విషయం టీచర్! చిన్నప్పటినుంచీ మా అక్కది డామినేటింగ్ మనస్తత్వం. మా అందరి మీదా అజమాయిషీ ఆవిడదే. ఆవిడ కూతుర్ని చేసుకుని, ఆవిడకు జీవితాంతం మరింత లొంగి పడి ఉండడం నా కిష్టం లేదు. పైగా, లలితను చూసి ఉండకపోతే రాజీ గురించి ఏమన్నా ఆలోచించే వాడినేమో కానీ, ఇప్పుడు నా నిర్ణయం మారదు. రాజీ గురించి మనం బాధపడక్కర్లేదు టీచర్! దానికి మా అక్కకు ఉన్న ఐశ్వర్యంతో నాకన్న నాలుగు రెట్లు గొప్ప మొగుణ్ణి తేగలదు. వెండి పానకపు బిందెలు, బంగారపు తొడుగులతో లలిత తండ్రి పెండ్లి చెయ్యలేడు. అట్లాంటి పేద కుటుంబంలోని గుణవంతురాలైన పిల్లను ఏ మాత్రం ఐశ్వర్యానికి తక్కువ లేని నన్ను కేవలం కట్నానికి లోబడి అన్యాయం చెయ్యమంటారా? మీరే చెప్పండి, టీచర్!" ఆవేశంగా అడిగాడు శేఖర్.

ఏం మాట్లాడలేకపోయింది సీతాదేవి.

అందరికీ ఎదురుతిరిగి రిజిస్టర్ మారేజ్ చేసుకున్నాడు శేఖర్ లలితను. ఆ విషయం వినగానే లలిత ఇంటిమీదపడి, వీలైనన్ని శాపనార్థాలు పెట్టి 'నా కూతురికి రాజా లాంటి సంబంధం తెస్తాను' అని శపథాలు పట్టి కక్ష తీర్చుకుంది రాజీ తల్లి. ఆ వేడిలో సీతాదేవిని కూడా పెట్టవలసిన నాలుగూ పెట్టింది. కానీ, రాజీమాత్రం ఏం మాట్లాడలేదు. ఆ మూగ చూపుల్లోని బాధ ఒక్క భగవంతుడికే తెలియాలి.

ఆ పెళ్ళి రోజు మాత్రం --

పెట్టె మీద కూర్చుని, గడ్డం కింద మోకాలు బోటు పెట్టి, "టీచర్!" అన్నది.

"ఏమమ్మా?"

"ఈపాటికి మామయ్య పెళ్లయిపోయి ఉంటుంది కదూ?" అంది. అంతే. వెంటనే కళ్లు తుడుచుకుంటూ లేచి వెళ్లిపోయింది.

మూడు నెలలు తిరక్కుండానే రాజీకి పెళ్లి నిశ్చయం చేశారు. "రాజాలాంటి సంబంధం" అన్నది వాళ్లమ్మ పెళ్లి కొడుకుని చూసి వచ్చి. పెళ్లివారు బొగ్గాకు వ్యాపారంలో లక్షలు ఆర్జించారట. చాలా చెప్పింది ఆవిడ.

కానీ, పెళ్లినాడు బంగారం గొలుసుతో మెరిసిపోతున్న నల్లటి మోటు పెళ్లి కొడుకూ, "ఇంకొంచెం పెద్ద రవ్వల దుద్దులు పెడతారనుకున్నాం, వదినా! ఇంతటితో సరిపుచ్చా రేమిటీ?" అనే అత్తగారూ, ఖరీదైన నైలాన్ చీరలు బాగా పైకి కట్టి, వీలైనన్ని నగలు దిగేసుకున్న ఆడబడుచులూ ... ఈ వాతావరణమంతా చూసి, బంగారపు బొమ్మలా ఉన్న రాజీని చూసి బాధపడింది సీతాదేవి. 'నాకు రాజీ మీద ఆప్యాయతే కానీ, రాజీకి అంతకన్నా మంచి సంబంధం దొరకడానికి తగిన తీరుగా పెంచలేదుగా వాళ్లమ్మ' అనుకున్నది సీతాదేవి విరక్తిగా.

"చూశావా, టీచర్! మామయ్య రానేలేదు" అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నది రాజీ, పీటల మీదకి వెళ్లబోతూ. శేఖర్ అప్పటికే బొంబాయిలో సెటిల్ అయాడు. కళ్లు తుడిచి పంపించింది సీతాదేవి.

అక్కడే స్తంభానికి ఆనుకుని నిలుచున్న ఆవిడకు–తను, చిన్ననాటి స్నేహితుణ్ణి ప్రేమించడం, అతను కట్నానికి, సౌందర్యానికి అమ్ముడుపోవడం, ఆ తరవాత తను వివాహం మీదే ఇచ్ఛ చంపుకుని బ్రతకడం–ఇవన్నీ గుర్తుకు వచ్చాయి.

'భగవాన్! ఆకర్షణ లేనివాళ్లకు ప్రేమరాహిత్యాన్నెందు కివ్వవయ్యా?' అనుకున్నది సీతాదేవి నిట్టూరుస్తూ.

ఏడోనెల సూడిదలకని వచ్చింది రాజీ. మరింత బాగుంది.

"సూడిదలకని అమ్మ రాళ్ల గాజులు చేయించింది, టీచర్!" అంది విరక్తిగా నవ్వుతూ.

ఆ నవ్వులోని నిస్పృహకు ఆశ్చర్యపడి, "ఎలా ఉంది, రాజీ, జీవితం?" అని మాట తప్పించింది.

"బాగానే ఉన్నది కానీ, మామయ్య గురించి ఏమన్నా వార్తలు తెలుస్తున్నాయా, టీచర్?" అంది కుతూహలంగా.

అదిరిపోయి చూసింది సీతాదేవి. 'ఈ పిల్ల ఇక అతణ్ణి మరిచిపోదా?' అనుకున్నది. కానీ, ఆ అమ్మాయి గడుపుతున్న అనాగరిక వాతావరణంలో మామయ్య తలపులు ఒయాసిస్‌లని ఆవిడకు తరవాత తెలిసింది. రాజీ కోరిన జీవితం శేఖర్‌తో. కానీ, దానికి రాజీని ఎంతవరకు అర్హురాలిని చేసింది వాళ్లమ్మ!

"ఫారిన్ వెళ్లాడటమ్మా! లలితకూడా వెళ్లిందిట. ఉత్తరం రాశాడు."

"ఉహుఁ!" అంది రాజీ, దీర్ఘంగా ఏదో ఆలోచిస్తూ.

"మీ అత్తవారు మంచివాళ్లేనా, రాజీ, నిన్ను బాగా చూస్తారా?" అంది మరోసారి మాట మారుస్తూ.

"ఆహా! వెండి గిన్నెలో వేడి అంబలి తాగే రకాలు... వాళ్ల గోల ఎందుకు టీచర్, ఇప్పుడు?" అని మాట మార్చింది. రాజీ మనస్తత్వంలో చాలా మార్పు వచ్చింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేది.

"దిక్కుమాలిన వెధవ. తమ్ముడనుకోవడానికే సిగ్గు. నా బిడ్డ జీవితం నాశనం చేశాడు" అని తిట్టుకునేది వాళ్లమ్మ రోజు కొకసారి శేఖర్ని. "ఊరుకో, అమ్మా!" అని అక్కడినుంచి వెళ్లిపోయేది కానీ, మరోమాట అనేది కాదు రాజీ.

ఒకరోజు తెల్లవారుజామున ఎవరో తొందరగా తలుపులు తడుతూంటే, ఉలిక్కిపడి లేచి తలుపులు తీసింది సీతాదేవి. రాజీ వాళ్లమ్మ! శేఖర్ పెళ్లి అయినప్పటినుంచి ఆవిడ సీతాదేవితో ముభావంగానే ఉండేది. ఇలాంటిది ఈ వేళప్పుడు...

"రాజీకి నెప్పులొస్తున్నాయి టీచర్! కొంచెం తొందరగా తోడువస్తారా?" అంది ఆవిడ ఖంగారుగా. వెంటనే అందరూ పరుగెత్తారు హాస్పిటల్కు. రాజీ తండ్రి ముఖంలో కత్తివాటుకు నెత్తురు లేదు. ఆ కుటుంబంలో ఆయన అంతర్వాహిని వంటివాడు. ఆయన మూగబాధ సీతాదేవిని మరింత కలచివేసింది. వెంటనే ఆపరేషన్ చెయ్యాలన్నది లేడీ డాక్టర్.

ఆపరేషన్ థియేటర్కు తీసుకుని వెళుతూ, "ఒకసారి వచ్చి అమ్మాయిని చూడండి" అన్నారు నర్సులు. గోలపెడుతూ పరుగెత్తారు తల్లీ, తండ్రీ. సీతాదేవి తలుపు దగ్గరే ఆగిపోయింది. 'భగవంతుడా! రాజీని రక్షించు' అనుకున్నది.

"సీతాదేవిగారూ! మిమ్మల్ని పిలుస్తోంది" అంటూ కళ్లనీళ్లు ఒత్తుకుంటూ వచ్చింది రాజీ తల్లి.

మెల్లిగా లోపలికి వెళ్లింది సీతాదేవి. తెల్లటి గుడ్డ మెడదాకా కప్పారు. ముఖమంతా ఎర్రబడి ఉంది. కళ్లలో నీళ్లు తిరుగుతున్నా, పెదవులు నవ్వాయి.

"రాజీ!" అంటూ చప్పున వెళ్లి చెయ్యి పట్టుకుంది సీతాదేవి, వెచ్చగా ఉన్నది చెయ్యి.

"నమస్కారాలు, టీచర్!" అంది రాజీ, రెండు చేతులూ జోడించి.

దుఃఖం పొంగుకు వచ్చింది సీతాదేవికి. "ఛీ! అదేమిటి? నీకేం భయంలేదు..."

"లేదు, టీచర్, నాకు తెలుసు ఏం జరిగేది..." అంది పెదవి నొక్కిపడుతూ.

"అమ్మా రాజీ!" అని కళ్లకు కొంగు అడ్డం పెట్టుకున్నది సీతాదేవి.

"టీచర్!" మళ్లీ పిలిచింది రాజీ.

"ఏమమ్మా?"

"ఇదుగో, టీచర్! ఇది నా జ్ఞాపకంగా మామయ్య కివ్వండి. రాజీని మామయ్య మరిచిపోయినా, మామయ్యను రాజీ మరిచిపోలేదని చెప్పండి" అని దుఃఖం ఆపుకోలేక రెండు చేతులతో ముఖం దాచుకున్నది రాజీ.

స్తబ్ధురాలై పోయింది సీతాదేవి.

"నోనో... షీఈస్ ఎమోషనల్... మేడమ్ ప్లీజ్!" అన్నారు నర్సులు– "వెళ్లిపొండి" అనే అర్థంతో.

తన చేతుల్లో రాజీ ఉంచిన తెల్లరాళ్ల ఉంగరాన్ని చూస్తూ అలాగే నిలబడిపోయింది సీతాదేవి.

"వెళుతున్నాను, టీచర్! మీ రాజీని మరిచిపోకండి..." అని 'ఇక వెళ్లండి' అన్నట్లు సంజ్ఞ చేసింది.

సీతాదేవి కన్నీటి పొరలలోనించి రాజీ చేతులు జోడించి నమస్కారం చెయ్యడం కనిపించింది. "అమ్మా, రాజీ!" అని కొంగు అడ్డం పెట్టుకుని బయటికి వచ్చింది.

ఆపరేషన్ థియేటర్ బయట గడిపిన గంటా యుగంలా ఉన్నది అందరికి. కానీ, రాజీ ప్రాణాలు ఆపరేషన్ టేబుల్ మీదే పోయాయి. డాక్టర్లు ఏవో కారణాలు చెప్పినా, రాజీ కోరి ఈ చావు తెచ్చుకున్నదనిపించింది సీతాదేవికి.

'మీరంతా రాజీ చావుకు కారణం...' అని కసిగా తిడదామనిపించి ఒక్కసారిగా వెనక్కు తిరిగిన సీతాదేవికి గుండెలవిసేలా ఏడుస్తున్న రాజీ తల్లి తండ్రులు కనబడ్డారు. ఏమనగలదామె? ఆడపిల్ల జీవితానికి ఏది కావాలో అది ఇవ్వలేని ఈ ప్రేమలకు, ఆప్యాయతలకు అర్థం ఏమిటి? అనుకున్నది.

సీతాదేవి ప్రస్తుతం ప్రశాంతంగా రిటైర్డ్ దశ గడుపుతున్నది. ఎంతో మంది విద్యార్థులకు స్నేహితురాలై తీర్చిదిద్ది వృద్ధిలోకి తెచ్చింది. ఎన్నో కుటుంబాలను ఆదుకున్నది. కానీ, ఆవిడకు రాజీ గుర్తుకు వచ్చినప్పుడల్లా దెబ్బతిన్న పావురంలాగా అయిపోయి, ఈ తృప్తి అంతా అణిగిపోతుంది.

వృద్ధురాలు, బ్లడ్‌ప్రెషర్ పేషెంటు అయిన సీతాదేవి గతానికి తట్టుకోలేక ఆ రాత్రి నిద్రకు దూరమై పోయింది. మెల్లిగా ఏదో గొణుక్కుంటూ ఆ ఉంగరం తీసి దాచింది.

❀ ❀ ❀

"టీచర్! వెళ్లిపోతున్నాను... ఈసారి సమ్మర్ ట్రిప్ వేద్దామనుకుంటున్నాం. అప్పుడు తప్పకుండా మీ దగ్గరకు వచ్చి రెండు రోజులుంటాం. వస్తా, టీచర్!" అని కాళ్లకు వంగి దణ్ణం పెట్టింది, మర్నాడు సాయంత్రం వచ్చిన లలిత.

"తప్పకుండా రండి ... శేఖర్‌ను చూసి పదేళ్లు దాటింది... ఏమిటో, ఆ ఊరు మారగానే విశేషాలు తెలియకుండా పోయాయి" అంది సీతాదేవి.

"నమస్తే, టీచర్!" అంది పాప, ముద్దుగా లేత చేతులు జోడించి.

"అయ్యో, తల్లీ! నీకూ టీచర్నే ... మళ్లీ నీ చేత కూడా ఎ, బి, సి, డిలు రాయిద్దామనే ఉన్నదమ్మా! ఏదీ మరి... ముసిల్దాన్నైపోయానుగా!" అని మృదువుగా పాప నుదుట ముద్దు పెట్టుకుంది. ఏదో ఆలోచన వచ్చి మెల్లిగా వెళ్లి, పెట్టెతీసి, ఆ తెల్లరాళ్ల ఉంగరం తీసి, "పాపా! చెయ్యేది?" అని ముద్దుగా ఉన్న పాప వేలికి వణుకుతూ ఆ ఉంగరం తొడిగింది.

'రాజీ .... నీకు ఇది తృప్తి కలిగిస్తుందనుకుంటా నమ్మా! ...' అనుకున్నది మనస్సులో, దుఃఖం ఆపుకుంటూ.

వెంటనే,"అయ్యో! ఉంగరం వదులైనట్లుంది. జాగ్రత్త తీసిదాచమ్మా, లలితా! పెద్దదైన తరవాత పెట్టు. అది ... అది కానుకమ్మా!" అంది వణుకుతున్న గొంతుకతో.

"ఎందుకు, టీచర్, ఇప్పుడివన్నీ ..." అంటూ ఉంగరం తీసి, ఒకసారి దానివంకా, సీతాదేవి వంకా మార్చి మార్చి చూసి, వెంటనే, "వస్తాను, టీచర్! ..." అని పాప నెత్తుకుని టాక్సీ ఎక్కింది లలిత.

❀ ❀ ❀

మరొక వారం రోజుల తరవాత .... భోజనం చేసి పడక కుర్చీలో పడుకుని విశ్రాంతి తీసుకుంటున్న సీతాదేవికి 'పోస్ట్' అన్న కేక వినబడింది. మెల్లిగా ఉత్తరం తీసుకుని చించింది.

"ప్రియమైన సీతా టీచర్‌కు" ... అని చదివి 'ఎవరబ్బా?' అనుకుంటూ సంతకం చూసింది. "లలిత" అని ఉన్నది. మెల్లిగా వెళ్లి పడకకుర్చీలో కూర్చుని ఉత్తరం చదవడం ప్రారంభించింది.

"ప్రియమైన సీతా టీచర్‌కు అనేక నమస్కారాలతో–

మీరు నా మీద చూపించిన వాత్సల్యానికి ఎంతో కృతజ్ఞురాలిని. టీచర్! మీరు ఎంతో అభిమానించిన రాజీకి శేఖర్‌ని దూరం చేశానని, మీరు నన్ను ద్వేషిస్తారని భయపడుతూ వచ్చాను. కాని, మీ ఆప్యాయతకు ద్వేషం తెలియదని మరొకసారి తెలుసుకున్నాను.

మీరు పాపకు ప్రెజంట్ చేసిన ఉంగరం ఎవరిదో మరిచిపోయా ననుకున్నారా, టీచర్? దాన్ని చూడగానే ఒక్కసారి నా గుండె కలుక్కుమన్నది. రాజీ అనుభవించవలసిన జీవితం నాది అయింది. అవును, టీచర్! స్వార్థంతో, పట్టుదలతో శేఖర్ ప్రేమను గెలుచుకున్నాను. ఐశ్వర్యం ఉండి, అందం ఉండి కూడా రాజీ శేఖర్‌కు దూరమవడానికి కారణం ఏమిటో తెలుసా? కొంతవరకు పెంపకం, టీచర్! అన్నీ ఇవ్వగలిగి, ఆడపిల్లకు కావలసిన అసలు శిక్షణ ఇవ్వలేని తల్లుల వల్ల ఈ దేశంలో చాలామంది ఆడపిల్లలు మనస్సు ఉండి కోరింది పొందలేకపోతున్నారు. జీవితానికి కావలసింది మనస్సే, టీచర్! కానీ, అదొక్కటి చాలదు. ఆడపిల్లకు అసలు సరిపోదు. టీచర్! రాజీతో అన్నాళ్లు పరిచయం ఉండి కూడా శేఖర్ ఆ ఉంగరాన్ని గుర్తుపట్టలేకపోయాడు.

'పిచ్చి టీచర్, ఇంత ఖరీదైన ప్రజంటేష నిచ్చారేమిటి పాపకు?' అని నవ్వి ఊరుకున్నాడు. అది రాజీ ఉంగరమని నేను చెప్పలేదు, టీచర్! చెప్పి, శేఖర్ని పశ్చాత్తాపానికి గురి చెయ్యలేను. అందుకే చెప్పలేదు. నేను స్వార్థపరురాల్నే

ఒప్పుకుంటాను. రాజీ నా తప్పులు ఎన్నింటినో క్షమించి ఉంటుంది. ఇది కూడా క్షమించే ఉంటుందనుకుంటాను.

కానీ, టీచర్! ... మీరనుకున్నట్లు నేను రాజీని మరిచిపోలేదు. మీరు మా పాప పేరు అడగడం మరిచిపోయారు. దాని పేరు రజని. అయినా, మేమంతా పిలిచేది 'రాజీ' అని!

నమస్కారాలతో,..

మీ...

-లలిత."

(ఆంధ్రప్రభ వారపత్రిక - 31-10-1973)